**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9666033186
9866092624



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 257 | volume: 1, Issue: 257 | గురువారం 16 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 3.00

PUBLISHED: KARIMNAGAR ,HYDERABAD
CMD&EDITOR:BHUPATHI SANTHOSH


## బెంగళూరుకు చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం



- ఆదిచుంచనగిరి మఠ కార్యక్రమానికి హాజరు...
- సీఎం సిద్ధరామయ్య ఆత్మీయ ఆహ్వానం...


**బెంగళూరు:** ఆదిచుంచనగిరి మఠ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు బెంగళూరుకు చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆత్మీయంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బెంగళూరు విమానాశ్రయంలో ప్రధాని మోదీకి అధికారిక స్వాగతం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం సిద్ధరామయ్య స్వయంగా హాజరై ప్రధానికి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిచుంచనగిరి మఠంలో నిర్వహించనున్న కార్యక్రమం కోసం ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై ఆయన ప్రసంగించే అవకాశం ఉందని సమాచారం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కృష్ణ బైరే గౌడ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీష్ కూడా పాల్గొన్నారు. ప్రముఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో నగరంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ముఖ్య ప్రదేశాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ పర్యటన ద్వారా కేంద్ర-రాష్ట్ర సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆదిచుంచనగిరి మఠ కార్యక్రమం రాష్ట్రంలో ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఐయిమ్స్ నాగ్‌పూర్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**నాగ్‌పూర్:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ స్నాతకోత్సవ వేడుకలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన వైద్య విద్యార్థులను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ.. ఐయిమ్స్ నాగ్‌పూర్ అతి తక్కువ కాలంలోనే వైద్య విద్య, పరిశోధనలు మరియు నాణ్యమైన ఆరోగ్య సేవల్లో దేశంలోనే ఒక ప్రముఖ కేంద్రంగా గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్య రంగంలో ఈ సంస్థ పోషిస్తున్న పాత్రను ఆమె ప్రత్యేకంగా కొనియాడారు. వైద్య రంగంలో సాంకేతికత ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, అది వైద్యుడిలోని కరుణ, చిత్తశుద్ధి మరియు రోగి పట్ల చూపే మానవీయతకు ప్రత్యామ్నాయం కాలేదని రాష్ట్రపతి స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు మరియు రోబోటిక్ సర్జరీలు వంటి అధునాతన పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, రోగికి లభించే మానసిక ధైర్యం మరియు వైద్యుడి స్పర్శలో ఉండే ఓదార్పు ఎంతో విలువైనవని ఆమె పేర్కొన్నారు. వైద్య వృత్తి అనేది కేవలం జీవనోపాధి కాదు, అది సమాజానికి చేసే ఒక గొప్ప సేవ అని గుర్తు చేశారు. మారుతున్న జీవనశైలి కారణంగా వస్తున్న కొత్త రకం వ్యాధులను ఎదుర్కోవడానికి వైద్య పరిశోధనలు మరింత వేగవంతం కావాలని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ఐయిమ్స్ నాగ్‌పూర్ వంటి సంస్థలు గ్రామీణ ఆరోగ్య సంరక్షణపై కూడా దృష్టి సారించాలని ఆమె సూచించారు. యువ వైద్యులు తమ విజ్ఞానాన్ని నిరంతరం అప్‌డేట్ చేసుకుంటూనే, మానవతా దృక్పథాన్ని వీడకూడదని హితవు పలికారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రితో పాటు ఐయిమ్స్ డైరెక్టర్ మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నాగ్‌పూర్ నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఐయిమ్స్ విద్యార్థులు మరియు అధ్యాపకులు రాష్ట్రపతి రాకతో ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

## హార్మూజ్ జలసంధిపై అమెరికా దిగ్బంధనం



**వాషింగ్టన్:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ హార్మూజ్ జలసంధితో పాటు ఇరాన్లోని కీలక ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు ప్రకటించింది. ఈ చర్యల భాగంగా దాదాపు 10 వేల మంది సైనికులు, మెరైనర్లు, వైమానిక దళ సిబ్బందిని మోహరించినట్లు తెలిపింది. ఈ పరిణామం ప్రాంతీయ భద్రతా పరిస్థితులను మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించడం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గట్టి దెబ్బ కొట్టడమే లక్ష్యంగా అమెరికా చర్యలు చేపట్టింది. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యం ఇరాన్‌కు ప్రధాన ఆదాయ వనరు కాగా, దిగ్బంధనం ప్రారంభమైన 36 గంటల్లోనే అక్కడి నుంచి బయల్దేరే వాణిజ్య నౌకలను పూర్తిగా నిలిపివేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. అమెరికా నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉంచినట్లు కూడా అధికారులు తెలిపారు. ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే లేదా లోపలకు వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకునేలా సన్నద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో, యూఏఈ నుంచి బయల్దేరిన 'రిచ్ స్టార్రీ' అనే నౌక కూడా హార్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించేందుకు ప్రయత్నించగా దిగ్బంధనం కారణంగా వెనుదిరిగింది. ఈ నౌకలో సుమారు 2.50 లక్షల బ్యారెల్ల చమురు ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ప్రపంచ వాణిజ్యం, ముఖ్యంగా చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పీర్జాదిగూడలో బీఆర్ఎస్‌లోకి కౌన్సిలర్ల చేరిక



**మేడ్చల్:** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని వారికి స్వాగతం పలికారు. స్థానిక నాయకులకు అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరోకటని విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో బీజేపీ మరో కొత్త కుట్రకు తెరలేపుతోందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటంలో బీఆర్ఎస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే ప్రయత్నం జరిగితే సహించబోమని కేటీఆర్ హెచ్చరించారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా సంక్షేమంపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ, తమ ప్రభుత్వం మార్కెట్ కమిటీలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. శాసనసభలో మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం కూడా ఆమోదించామని గుర్తుచేశారు. మహిళల సాధికారతకు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన ఆర్థిక సాయం, స్కూటీల వాగ్దానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవి నిలిచిపోయాయని విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

## 'వర్ణ మైత్రి' చిత్రకళ ప్రదర్శన ప్రారంభం



**హైదరాబాద్:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా 'వర్ణ మైత్రి: రుమాలే చెన్నవసవయ్య చిత్రాల ప్రతిప్రదర్శన'ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనను హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాలార్ జంగ్ మ్యూజియం మరియు రుమాలే ఆర్ట్ హౌస్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కళాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రదర్శనను సందర్శించారు. చిత్రకళపై ఆసక్తి ఉన్న వారికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుమాలే చెన్నవసవయ్య చిత్రాల్లో భారతీయ సాంస్కృతిక విలువలు, సంప్రదాయ కళా వైభవం ప్రతిబింబిస్తున్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఆయన కృతులు కళా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందినవని కొనియాడారు. ఈ ప్రదర్శనలో వివిధ దశల్లో రూపొందించిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రతి చిత్రంలో రంగుల సమన్వయం, భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కళాకారుని సృజనాత్మకతకు ఇది నిదర్శనమని సందర్శకులు అభిప్రాయపడ్డారు. కళా ప్రదర్శనలు సమాజంలో సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. యువ కళాకారులకు ఇవి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన కొద్ది రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రదర్శనను సందర్శించాలని సూచించారు.

## ఇరాన్ యుద్ధంపై అమెరికా ప్రజల్లో అసంతృప్తి



**వాషింగ్టన్:** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధానికి సంబంధించి అమెరికా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్సాస్-రాయిటర్స్ సంయుక్తంగా నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న యుద్ధంపై ప్రజల్లో అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై దాడులను అమెరికా ప్రజలే వ్యతిరేకించడం గమనార్హం. మరో 22 శాతం మంది ఈ అంశంపై స్పందించడానికి ఇష్టపడలేదు. ఈ ఫలితాలు యుద్ధంపై అమెరికా ప్రజల్లో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయని సూచిస్తున్నాయి. రాజకీయ పార్టీల పరంగా చూస్తే, డెమోక్రాట్లు, ఇండిపెండెంట్లు, రిపబ్లికన్ల మధ్య అభిప్రాయాల్లో తేడాలు కనిపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 65 శాతం మంది డెమోక్రాట్లు, 56 శాతం మంది ఇండిపెండెంట్లు యుద్ధానికి వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక రిపబ్లికన్ పార్టీలో కూడా పూర్తిగా ఏకాభిప్రాయం లేదని తేలింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు చెందిన రిపబ్లికన్ వర్గంలో 54 శాతం మంది యుద్ధానికి మద్దతు తెలుపుతుండగా, మిగిలిన వారు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ సర్వే ఫలితాలు అమెరికా రాజకీయ వర్గాల్లోనే కాకుండా ప్రజల్లో కూడా యుద్ధంపై విభిన్న దృక్పథాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి.

## లంబడిపల్లిలో బిజెపి మండల నాయకులకు ఘన సన్మానం

**-పార్టీ బలోపేతానికి...**

**-కార్యకర్తలు పునరంకితం కావాలి: పొన్నం సాయి గౌడ్...**



**మల్యాల ఏప్రిల్ 15 మన వార్త** మల్యాల మండలం లంబాడిపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి అధ్యక్షులు మరియు కార్యకర్తలు కలిసి మండల నాయకులను ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న మండల ప్రధాన కార్యదర్శి పొన్నం సాయి గౌడ్, మండల కార్యదర్శి కట్ల జ్యోతి, మండల కార్యవర్గ సభ్యులు బల్కం లక్ష్మణ్, దూస మహేష్ గార్లను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా గౌరవించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పొన్నం సాయి గౌడ్ మాట్లాడుతూ.. పార్టీకి బూత్ స్థాయి అధ్యక్షులే అసలైన బలమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి నిరంతరం పోరాడుతుందని, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బూత్ స్థాయి అధ్యక్షులు మామిడి నాగరాజు, అలువాల మధు, దూస శేఖర్, కొమ్మనవేణి నాగరాజ్, వేముల సాగర్ తో పాటు పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిసాన్ దాస్ పేట లో శ్రీ భక్తాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవ వేడుకలు



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15: (మన వార్త ప్రతినిధి)** ఎల్లారెడ్డిపేట మండలం, కిసాన్ దాస్ పేట గ్రామంలో ని, శ్రీ ఆంజనేయ స్వామి 16,వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి మరియు చందన అభిషేకం నవగ్రహ పూజ కార్యక్రమంలో పాల్గొన్న స్వామివారి ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్న జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ ఎనుగందుల నరసింహులు, మేగి నరసయ్య, గుండాడి వెంకటరెడ్డి, గాజుల దేవదాస్, వనం రమేష్, నూకల శ్రీనివాస్, స్వామి, కొర్రి రమేష్, నాగుల ప్రదీప్ ఇట్టి వార్షికోత్సవ సందర్భంలో భాగంగా తదితరులు పాల్గొన్నారు

## మల్యాల మండలంలో రేషన్ కార్డుల రద్దు ప్రకంపనలు..

**-క్షేత్రస్థాయి విచారణ కోరుతున్న మండల వాసులు...**



**మల్యాల, ఏప్రిల్ 15: మన వార్త** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అనర్హులైన వారి రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ ముమ్మరం కావడంతో మల్యాల మండల ప్రజల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ డేటా విశ్లేషణ చేస్తుండటంతో, ఎవరి కార్డు ఎప్పుడు రద్దవుతుందోనన్న భయం సామాన్యులను వెంటాడుతోంది. ఇప్పటికే జగిత్యాల జిల్లాలో సుమారు 9,281 కార్డులను అధికారులు రద్దు జాబితాలో చేర్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గత కొన్నాళ్లుగా రేషన్ కార్డులను ఆధార్, పాన్ (PAN) కార్డులతో అనుసంధానించిన అధికారులు, దాని ఆధారంగా లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులను అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గతంలో పిల్లలు విదేశీ చదువుల కోసం ఇంటి నిర్మాణం రుణాల కోసం లేదా చిన్నపాటి బిజినెస్ రుణాలు పొందడం కోసం ఐటీ రిటర్న్స్ (Income TaI Returns) దాఖలు చేసిన వారి కార్డులపై వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగిత్యాల జిల్లాలో మొత్తం 3,52,072 రేషన్ కార్డులు ఉండగా, తాజా ప్రక్షాళనలో GST మరియు IT చెల్లింపుదారులు లక్ష్యంగా ఈ చర్యలు ఉన్నాయని నివేదించింది. "మేము రెక్కాడితే గానీ డొక్కాడని పేదలం. పొరపాటునో, తెలియకనో గతంలో చేసిన కొన్ని ఆర్థిక లావాదేవీల వల్ల ఇప్పుడు మా రేషన్ కార్డు పోతే ప్రభుత్వ పథకాలన్నీ ఆగిపోతాయి" అని మల్యాల మండలంలోని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం కంప్యూటర్ డేటా ఆధారంగా కాకుండా, అధికారులు గ్రామాల్లోకి వచ్చి క్షేత్రస్థాయి విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రేషన్ కార్డు తొలగించడానికి ముఖ్య కారణాలు వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువ ఉన్నట్లు గుర్తించడం. 2.5 ఎకరాలకు మించి భూమి కలిగి ఉండటం వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని కార్డులను తొలగించడం. ప్రస్తుతం కార్డుల తొలగింపు వార్తలు మల్యాల మండలంలో హాట్ టాపిక్‌గా మారాయి. అధికారులు స్పందించి అర్హులైన పేదలకు భరోసా ఇవ్వాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## దుడ్డె పై దాడి చేసి చంపి తిన్న చిరుత



**-భయందోళనలో పోతిరెడ్డి పల్లె గ్రామస్తులు...**

**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15 : (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డి పల్లె గ్రామంలో చిరుత దుడ్డె పై దాడి చేసి చంపి తిన్న ఘటన మంగళవారం రాత్రి జరిగింది దీంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు,పోతిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన బుడిగే జంగాల కులానికి చెందిన సదుల పూర్ణ అటవీ శివారు ప్రాంతంలో నివసిస్తుంది. తమ గుడిసెల వద్ద గేదె, దూడను కట్టేయగా తెల్లవారుజామున లేచి చూసేసరికి దుడ్డెను చిరుత చంపి పొట్ట భాగం పూర్తిగా తినివేసి ఉందని , దానిని చూసి ఆ కుటుంబం బోరున విలపించింది. అదేవిధంగా చిరుత కలకలం తో గ్రామంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. వెంటనే అటవీ శాఖ అదికారులు సిబ్బంది చిరుత ను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నాన్న హెల్మెట్ పెట్టుకో అమ్మకు నాకు హెల్మెట్ ఇప్పించు...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి)**నాన్న హెల్మెట్ ధరించు అమ్మకు నాకు హెల్మెట్ ఇప్పించు హెల్మెట్ పెట్టకుంటే నేను నీ బైక్ పై రాను అనే వినూత్న కార్యక్రమాన్ని చిన్న శంకరంపేట ఎస్సై నారాయణగౌడ్ చేపట్టారు, చిన్న శంకరం పేట మండల కేంద్రంలోని మేరీమాత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు పురస్కరించుకొని విద్యార్థులకు బస్సు డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు అదేవిధంగా నాన్న హెల్మెట్ పెట్టుకో అమ్మకు నాకు హెల్మెట్ ఇప్పించు అని విద్యార్థులు తమ పాఠశాలలో నుండి వారి తల్లిదండ్రులకు పోస్ట్ కార్డు పంపించే విధంగా ఎస్సై నారాయణ గౌడ్ తనదైన శైలిలో వినూత్నంగా పోస్ట్ కార్డులను విద్యార్థులకు అందజేశారు, విద్యార్థులు తమ కుటుంబంలో వాహనాల్లో నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడి గాయాలు కాకుండా ఉండే విధంగా వారికి అవగాహన కల్పించారు, ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించే విధంగా చూసుకోవాలని హెల్మెట్ ఉంటేనే బైక్ పై వస్తానని వారికి సూచించాలని విద్యార్థులకు తెలిపారు, పాఠశాల సిబ్బంది ఎస్సై నారాయణ గౌడ్ శాలువాతో సన్మానించారు, ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కల్పించడం జరుగుతుందని ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కారు నడిపించేవారు సీటు బెల్టు ధరించాలని వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అతివేగం పనికిరాదని వేగం కన్నా ప్రాణం మిన్న అనే విధంగా జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణ గౌడ్ తో పాటు పాఠశాల సిబ్బంది జోసెఫ్ నేడిమేనాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -15 (మన వార్త )**ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీ బీపీసీలో కీర్తన 436/440, మర్రిపల్లి కేజీబీవీ ఎంపీసీలో బీ మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జీ మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎంపీ హెచ్ డబ్ల్యూలో ఎల్ శృతికి490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, మర్రిపల్లి కేజీబీవీలో జీ శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికను విడుదల చేసిన కమిటీ సభ్యులు...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 15 ( మన వార్త ప్రతినిధి)**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో ఈనెల 19వ తేదీన నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రంగారావు తెలిపారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక అతిథి గృహం ఆవరణలో హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రికను చిన్న శంకరంపేట మండల హిందూ సమయంలో ఉత్సవ కమిటీ విడుదల చేశారు, ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు డాక్టర్ రంగారావు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని సోమేశ్వర దేవాలయం వద్ద హిందూ సమ్మేళనం చేపట్టడం జరిగిందని హిందూ బంధువులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి మన దేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలపాలని లక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాలను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత ఎంతో అవసరమని హిందూ సమాజం పట్ల గౌరవం, ఏకాత్మత భావన, స్వధర్మం పట్ల అంకితభావం వంటి వాటిని వికసింప చేసేందుకే హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడమైందని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం చిన్న శంకరంపేట ఉత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రంగారావు,ఉపాధ్యక్షులు మల్లికార్జున్, డాక్టర్ సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శి నీల శ్యామ్,కోశాధికారి బండారు శంకర్, వనం నర్సింలు, సభ్యులు భౌద్ధిక్ ప్రముక్ లక్ష్మణ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడాలో ఆకుకూరలపై అవగాహన...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 15 ( మన వార్త ప్రతినిధి)** పోషణ పక్వాడా లో భాగంగా చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మూడవ అంగన్వాడి కేంద్రంలో కిచెన్ గార్డెన్ లో పెంచుతున్నటువంటి ఆకుకూరల పెంపకం పై విద్యార్థులకు, తల్లులకు, అవగాహన కల్పించారు, అనంతరం విద్యార్థులచే మొక్కలకు నీరు పోయించారు, ఇంటి వద్ద కూడా ఆకుకూరాలని పెంచుకోవాలని అంగన్వాడి టీచర్ నాగరాణి విద్యార్థులకు తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడాలో భాగంగా 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, నేడు కిచెన్ గార్డెన్ లో పెంచుతున్నటువంటి ఆకుకూరల పెంపకంపై వాటి వల్ల కలిగే లాభాలపై విద్యార్థులకు సూచించడం జరిగిందని ఎలాంటి రసాయన ఎరువులు వేయకుండా ఆకుకూరలు పండించి విద్యార్థులకు వంట చేసి అందించడం జరుగుతుందని, ఆకుకూరలలో పుష్కలమైన పోషక పదార్థాలు ఉంటాయని అందుకే విద్యార్థులకు ఎక్కువ శాతం ఆకుకూరలు, పప్పు దినుసులు వంటచేసి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ నాగరాణి, తో పాటు ఆయా రేణుక పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన పోలీసులు...



**నిజాంపేట ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి )**నిజాంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో బుధవారం ప్రజా పాలన 99 రోజుల్లో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని ఎస్ఐ రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరైయ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రత నియమాలు,మానవహారం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు వాహనాలు నడపాలని మైనర్లు వాహనాలు నడిపినట్లైతే అట్టి వాహనాన్ని సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లైతే అట్టి వారిపై కేసు నమోదు చేసి 10వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ పోలీస్ శాఖ కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుధాకర్,సునీత, కానిస్టేబుల్ హరీష్, గ్రామ సర్పంచ్ నరేందర్, ఉప సర్పంచ్ బాబు,కార్యదర్శి నర్సింలు, ఉపాధ్యాయులు రమేష్, తదితరులు ఉన్నారు.

## అల్వాల్‌లో ఇందిరా మహిళా శక్తి టిఫిన్ సెంటర్ ప్రారంభం

**-మహిళా సాధికారతకు మరో ముందడుగు...**



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఏప్రిల్ 15 మన వార్త :** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆల్వాల్ లయోలా కాలేజ్ సమీపంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్,అల్వాల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఇందిరా మహిళా శక్తి టిఫిన్ సెంటర్" మరియు ఫిష్ ఫ్రై దుకాణాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం శివాత్మక మహిళా పొదుపు సంఘ సభ్యురాలు శ్యామల రవి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, స్థానిక అధికారులతో కలిసి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి చిన్న వ్యాపారాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవాలనిప్రభుత్వం కూడా వారికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. మహిళా సమాఖ్యలకు సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే, సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఢిల్లీ పరమేష్, శరణగిరి, సురేష్, లక్ష్మణ్ యాదవ్, పవన్, రేవంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సులోచన, శారద, ఉమ, సంగీత తదితరులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సురేష్, ప్రవీణ్, సుప్రియ, స్రవంతి, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సాధికారత దిశగా ఇటువంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహం పొందాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## వికలాంగుల హక్కుల కోసం పోరాటానికి గుర్తింపు

**-ఎన్. వినయ్ మాదిగకు 'దళిత రత్న' అవార్డు...**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఏప్రిల్ 15 మన వార్త :**భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే "దళిత రత్న" అవార్డుకు ఈ సంవత్సరం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్ మాదిగ ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్ లోని రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన అంబేద్కర్ వారోత్సవాల కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ఘనంగా అందజేసింది. వికలాంగుల హక్కులు, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరం పోరాటం చేస్తూ, ముఖ్యంగా ఎస్సి వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం అలుపెరగని కృషి చేసినందుకు ఈ పురస్కారం ఆయనకు దక్కింది. ఈ అవార్డును మల్కాజ్‌గిరి ఎస్సి వెల్ఫేర్ అసోసియేషన్ వారు, ఎం.ఆర్.పి.ఎస్ సంస్థ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ నాయకులు థిప్పరపు లక్ష్మణ్ మాదిగ, కనకరాజు మాదిగ, అంజి మాదిగ, మనోహర్ మాదిగతో పాటు అంబేద్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. వినయ్ మాదిగ మాట్లాడుతూ, తనకు ఈ గౌరవం అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం, మల్కాజ్‌గిరి ఎస్సి వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఎం.ఆర్.పి.ఎస్ నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా వికలాంగుల హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసే వ్యక్తులకు ఇటువంటి అవార్డులు మరింత ప్రోత్సాహం కలిగిస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




## ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం

**-మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత...**

**-మధిర ట్యాంక్ బండ్ పై రోడ్డు మరమ్మతులు...**

**మధిర, ఏప్రిల్15( మన వార్త):** ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా మధిర మున్సిపాలిటీ నూతన పాలకవర్గం పనిచేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. మధిర ట్యాంక్ బండపై పేరుకుపోయిన, పారిశుధ్యం, రోడ్డు మరమ్మతులు, విద్యుత్ దీపాల సమస్యల పట్ల దృష్టి సారించిన చైర్మన్ సుజాత ఆ వార్డు కౌన్సిలర్ రేవతితో కలిసి బుధవారం పనులు ప్రారంభించారు. ఈ మేరకు కార్మికులు ట్యాంకు బండపై దీపాలు, పగిలిపోయిన రోడ్డు మరమ్మతులను పూర్తి చేసి కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ, మధిర ట్యాంక్ బండకు వచ్చే ప్రజలకు మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడానికి పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలు త్వరలో చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఐడీసీఎంఎస్ కేంద్రం ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పందిమడుగు ప్రజల కృతజ్ఞతలు

**సిరికొండ, ఏప్రిల్ 15 (మన వార్త ప్రతినిధి):**పందిమడుగు గ్రామంలో (ఐ. డి. సి ఎం. ఎస్) కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఈ కేంద్రం రైతులు మరియు మహిళా సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి కి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. (ఐడీసీఎంఎస్) కేంద్రం ద్వారా రైతులకు సరైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ఇబ్బందులు తగ్గుతాయని, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి ఇది ఒక కీలక అడుగుగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ రామ్ బెక్కం, అశీష్, దేశ్ నాయక్, ఎర్ర లక్ష్మి, ఉప సర్పంచ్ విజయ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీనర్సయ్య మహిళా సంఘం (సి. సి) సుక్క భాస్కర్, వీడీసీ చైర్మన్ మోహన్ నాయక్, సర్దన్ ధర్మపురి, తదితరులు పాల్గొనడం జరిగింది



## ప్రభుత్వం మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని సుజాత నగర్ కేంద్రంలో ఏర్పాటు చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15 మనవార్త ప్రతినిధి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం కేంద్రంలో మొక్క కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని. బి.ఆర్.ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారురైతులు పండించిన యాసంగి మొక్కజొన్న పంట పూర్తయిన నేటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ ఆరోపించారు. దళారులు వారికి నచ్చిన ధరలతో రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. దళారులను అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ అధికారులు వెంటనే స్పందించి మొక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు లేనియెడల రైతులను కూడగట్టి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు



## రోడ్డు భద్రతా నియమాలు పాటించండి...

**-చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి...**

**చేగుంట ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట విద్యార్థులు చేగుంట పాఠశాల నుండి గాంధీ చౌరస్తా వరకు బారీ ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు, ఈ సందర్భంగా చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామని, మద్యం తాగి వాహనాలు నడప రాదని, అతివేగం కూడా ప్రమాదాల కారణమవుతాయని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలి వారన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎంఈఓ నీరజ, ఎస్సై 2 బిక్య నాయక్, పోలీస్ సిబ్బంది వెంకటేష్, మహేష్, సిద్దు, రవి, ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, గర్దాస్ మనోహర్ రావు, రావుల వెంకటేష్, ఉమామహేశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు




## పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు

**-జె ఎన్ గుప్తా ప్రిన్సిపాల్...**

**జహీరాబాద్, ఏప్రిల్ 15 (మన వార్త):** పదవ తరగతి ఉత్తీర్ణులు అయి పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలు రాయాలనుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జహీరాబాద్ పురపాలక సంఘం పరిధి రంజోల్ లో గల శ్రీ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె ఎన్ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 వ తేదీ ఉదయం 10 గంటల నుండి 11 గంటల 30 నిమిషముల వరకు రంజోల్ లో గల పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు ప్రారంభించబడినని పేర్కొన్నారు. అదే విధంగా పాలిసెట్ 2026 పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి హెల్ప్ లైన్ కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు, కౌంటర్ లో పరీక్ష రుసుము తప్ప ఎలాంటి అదనపు రుసుము తీసుకోబడదని, దరఖాస్తు సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా హెల్ప్ లైనా సెంటర్ పరిష్కరిస్తారని వివరించారు. కావున ఇట్టి సదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్, పోలిసెట్ సమన్వయకర్త కోరారు. పోలిసెట్ శిక్షణా తరగతుల కొరకు, ఎంట్రెన్స్ కొరకు ఉన్న సందేహాలను పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్ లైన్ ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలను మార్చిన యాజమాన్యం రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలి: ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15 (మన వార్తా ప్రతినిధి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి సివిక్ కాంట్రాక్ట్ కార్మికులకు వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో పని వేళలను మార్చాలని, రక్షణ చర్యలు చేపట్టాలని కోరిన నేపథ్యంలో ఈ రోజు నుండి కొత్తగూడెం కార్పొరేటర్ లో సివిల్ డిపార్ట్మెంట్ వారు ఒక్కపూట కు పనులను మార్చడం జరిగిందని, అందుకు కార్పొరేట్ సివిల్ అధికారులకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్– ఏ ఐ టి యు సి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు. పనివేళతో పాటు వడదెబ్బకు గురికాకుండా సరైన రక్షణ చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం నాడు కార్పొరేట్ లోని రైటర్ బస్తి, ఆస్పటల్ ఏరియా సివిక్, హాస్పిటల్ ఇన్సైడ్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశాలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలపై స్పందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, సంధ్య, రామకృష్ణ, లక్ష్మి, సంజీవరావు, రమణ, రామకృష్ణ, అప్పారావు, విజయ్, రమేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు కార్పొరేట్ స్థాయి చికిత్సే లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15 (మన వార్తా ప్రతినిధి )**సత్తుపల్లి నియోజకవర్గం బుధవారం ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఒకేరోజు మూడు ప్రభుత్వ ఆస్పత్రులనుప్రారంభించారురూ. 34కోట్లభారీవ్యయంతో నిర్మించిన 100 పడకల వైద్య విధాన పరిషత్ ఏరియా ఆస్పత్రితో పాటు కల్లూరు (50 పడకలు), పెనుబల్లి (30 పడకలు) ఆస్పత్రులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలిసి ప్రజలకు అంకితం చేశారు. పేదలకు అండగా ఆరోగ్యశ్రీ. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్మి తమ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. "గత పాలకులు కాగితాలకే పరిమితం చేసిన భవనాలను, అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశాం. ధనికులకు అందే వైద్యం పేదవాడికి కూడా ఉచితంగా అందాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. అందుకే బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం" అని ఆయన వివరించారు. విద్యా రంగంలో కీలక మార్పులుమంత్రి పొంగులేటి విద్యా రంగానికి సంబంధించి పలు కీలక ప్రకటనలు చేశారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు' విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పులు తెస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా చేయాలి...

**చేగుంట ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి)** చేగుంట మండల కేంద్రం భౌగోళికంగా వసతులపరంగా అన్ని రకాలుగా ఉన్నందున చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా చేయాలని చేగుంట మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు దొంతి రెడ్డి ఎల్లారెడ్డి మరియు చేగుంట మండల బిజెపి పార్టీ నాయకులు కోరారు. ఈరోజు చేగుంట తాసిల్దార్ శివప్రసాద్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేగుంట మండల కేంద్రంలో రైల్వే స్టేషన్, 44 హైవేతోపాటు పరిశ్రమల కేంద్రంగా, విద్యాసంస్థలు నియోజకవర్గానికి కావాల్సిన ప్రభుత్వ భూమి కలదు మరియు చుట్టూ ఉన్న మండలాలకు మధ్యలో ఉన్నందున చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా చేయాలని వారు కోరారు. నియోజకవర్గ ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న మండలం కావున చేగుంట మండల ప్రజల అభిప్రాయం మేరకు చేగుంటను నియోజకవర్గ కేంద్రంగా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు దొంతి రెడ్డి ఎల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చింతల భూపాల్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం గణేష్ రవికుమార్, వార్డు సభ్యులు సాయిబాబా, ఎల్లేష్, రవి పోలంపల్లి వార్డు సభ్యుడు శేఖర్ గౌడ్ మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.




## ఉపాధ్యాయ వృత్తి సమాజానికి మార్గదర్శకం సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్

**సిరికొండ, ఏప్రిల్ 15 (మన వార్త ప్రతినిధి):**సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దేవేందర్ పదవి విరమణ సందర్భంగా ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, దేవేందర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవనీయమైనదని, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. పిల్లలు తమ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని విద్యలో ముందుకు సాగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, సిరికొండ మండల గౌడ యూత్ అధ్యక్షుడు కోరేపు శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యా రాణి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 108 అంబులెన్సును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ తనిఖీ



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15 : (మన వార్తా ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లాఎల్లారెడ్డిపేట మండలం 108 అంబులెన్సును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, రాజన్న సిరిసిల్ల డిస్టిక్ మేనేజర్ అరుణ్ కుమార్ లు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వెహికల్ కండిషన్ ఎమర్జెన్సీ డ్రగ్స్ యూక్యుమెంట్స్, పనితీరును పరిశీలించారు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు గోల్డెన్ అవర్ సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన వైద్యం 24,గంటల సేవలను అందించి హాస్పిటల్లకు షిఫ్ట్ చేయాలని సూచించారుఈ కార్యక్రమంలో ఈఎంటి బి.రాజు, పైలెట్ నీలేష్ 102 కెప్టెన్లు చల్ల మధుసూదన్ రెడ్డి, సాగర్ లు పాల్గొన్నారు,

## సుజాతనగర్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15 (మన వార్తా ప్రతినిధి )** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ కార్పొరేషన్ కార్యాలయం నందు కార్పొరేటర్స్ లింగం పుష్పావతి , చింతలపూడి శ్రావణి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . మరియు వేల్పుల భాస్కర్, కత్తి బాలకృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలోముఖ్యఅతిథిగా టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు పాల్గొని ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతోనే సమానత్వం సాధ్యమని , బడుగు ,బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్ కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహానుభావుడు అని ఆయన సేవలను కొనియాడుతూ , దేశ పురోగతికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఏకైక సాధనమని ఆయన అంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు . ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ మాజీ చైర్మన్ మండే వీర హనుమంతరావు , ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పిచ్చి రెడ్డి ,సుజాతనగర్ తాహసిల్దార్ కృష్ణ ప్రసాద్, సుజాతనగర్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ అశోక్ చౌహాన్,స్థానిక నాయకులు చింతలపూడి. సాయి,బొడ్డు కేశవరావు ,కోటేష్ నాయక్, నరసింహారావు, రవీందర్, శ్రీనివాసరావు పలువురు అధికారులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు .

## రహదారి భద్రతపై సిరిసిల్లలో ప్రతిజ్ఞ రవాణా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం



**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 15 : (మన వార్తా ప్రతినిధి )**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రవాణా శాఖ, పోలీస్ వారి ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నేతన్న చౌరస్తా వద్ద వాహనదారులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ బుధవారం చేయడం జరిగింది. జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చునా. రోడ్డు పై ప్రయాణం చేసే సమయాల్లో చిన్న చిన్న తప్పిదాలు మనతో పాటు ఎదుటివారి కుటుంబాలు ఇబ్బంది పడతాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉన్నది అందరి రక్షణ కోసమే అని, ట్రాఫిక్ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యం చేరాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, స్వీయ రక్షణార్థం హెల్మెట్ తప్పక ధరించాలని,వాహనాలు నడిపే సమయాల్లో మొబైల్ ఫోన్ వదాద్దని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంటను “గోల్డెన్ అవర్”గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వస్తున్నామని ప్రజలు వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రవాణా శాఖ, పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు. సురక్షితంగా చేసే ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ టీ ఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, డీఎస్పీ నాగేంద్ర చారి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృథ్వీ రాజ్ వర్మ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు. రహదారి భద్రత వారోత్సవాలు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్టాండులో ప్రైవేటు హైస్కూల్ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాలు బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి ఎల్లారెడ్డిపేట సిఐ పో వెంకటేష్ ఎస్ఐ రాహుల్ రెడ్డి ఆ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా డిఎస్పి నాగేంద్ర చారి మాట్లాడుతూ రహదారి భద్రత పాటించి ప్రతి ఒక్కరూ ఇంటికి క్షేమంగా చేరుకోవాలని భార్యా పిల్లలను కుటుంబ జీవనాన్ని సాగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**నిజాంపేట ఏప్రిల్ 15 ( మన వార్త ప్రతినిధి)**రామాయంపేట పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. నిజాంపేట మండల కేంద్రంలోని రేణుక ఫంక్షన్ హాల్ లో 85 86 ఎస్ఎస్సి బ్యాచ్ కి చెందిన 46 మంది విద్యార్థులు ఒకే వేదికపై వారి ఆవ భావాలు పంచుకున్నారు. గత స్మృతులు 40 ఏళ్ల జీవిత విశేషాలను అందరూ ఒకే వేదికపై కి వచ్చి ఒకరికొకరు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పుడు చదువు చెప్పిన గురువులు మల్లయ్య జనార్దన్ రెడ్డి బాలయ్య తిరుమల్ రావు సార్లను ఘనంగా శాలువాలతో సన్మానించి పాదాభివందనం చేసి జ్ఞాపికలను సమర్పించి అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరుగా స్టేజి పైకి వచ్చి తమ జీవిత విశేషాలను తెలిపారు. అనంతరం విందును ఆరగించి ఇక వారి ఆటపాటలు మొదలుపెట్టారు. అప్పటి మా మిత్రురాలు కూడా కౌసల్య పద్మ వెంకటలక్ష్మి లక్ష్మి కళ లు కూడా మాతో పాటు స్టెప్పులేశారు. 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుందరం కలుసుకోవడం ఆనందంగా ఉందని మాలో కొంతమంది విద్యార్థులు మంజీర సుధాకర్ ,కట్ట ప్రభాకర్, కరికే.విద్యాసాగర్, ఎం. ప్రభాకర్, బాలయ్య బ్రహ్మచారి, నాగయ్య, నాగ గౌడ్, భూపాల్ రెడ్డి ,లక్ష్మణ్ ,కౌసల్య, దయాకర్ , రాములు, రామచంద్రం, మల్లేశం తదితరులు వేదికపై తెలిపారు. పూర్వ విద్యార్థులు కొంతమంది తమ సంతోషాన్ని వెలగకుతూ ఆనంద భాష్పాలను రాల్చారు. ఇంతకు ఈ వేదికపై ఉన్న మనమేనా అంటూ ఒకరికొకరు సంభాషించుకోవడం కనిపించింది. ఇంత ప్రేమ మా లోకంలో ఉన్న 40 సంవత్సరాలుగా మనం ఎక్కడున్నామో తెలియకుండా ఉన్నాం. అంటూ గత ఆవ భావాలను ఒకరికి ఒకరు చెప్పుకోవడం హర్షించదగ్గ విషయమే.

## డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గుగ్గిళ్ళ వేణు



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15: (మన వార్తా ప్రతినిధి)** ఎల్లారెడ్డిపేట మండల డిప్యూటీ తహసీల్దారుగా గుగ్గిళ్ళ వేణు బుధవారం బాధ్యతలు స్వీకరించారు,సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సెక్షన్లో పని చేసిన ఆయనను ఎల్లారెడ్డిపేట డిప్యూటీ తాసిల్దార్ గా బదిలీ చేస్తూ ఇక్కడ డిప్యూటీ తహాసిల్దారుగా పనిచేసిన మురళీకృష్ణను తంగళ్ళపల్లి డిప్యూటీ తాసిల్దార్ గా బదిలీ చేశారు, ఈ సందర్భంగా తిమ్మాపూర్ సింగిల్ విండో ఉపాధ్యక్షులు బుగ్గ కృష్ణమూర్తి శర్మ జిల్లా కాంగ్రెస్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా డిప్యూటీ తాసిల్దార్ వెణు ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు

## 2BHK కాలనీల వాణిజ్య దుకాణాల వేలానికి వ్యతిరేకంగా సీపీఎం ధర్నా




**అల్వాల్ ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆందోళన.**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఏప్రిల్ 15 మన వార్త :2BHK కాలనీలలోని వాణిజ్య సముదాయాలను వేలం వేసి విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా సీపీఎం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్వాల్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా అనంతరం అల్వాల్ ఆర్డిఓ కి పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్,రాజశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలోని 16 2BHK కాలనీలలో ఉన్న మొత్తం 992 వాణిజ్య సముదాయాలను వేలం పాట ద్వారా విక్రయించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 2దీఎఖ కాలనీల నిర్వహణ కోసం, ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండే విధంగా వాణిజ్య సముదాయాలను కూడా నిర్మించిందని వారు గుర్తుచేశారు. ఈ సముదాయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని లిఫ్టులు, మరమ్మత్తులు మరియు ఇతర నిర్వహణ ఖర్చులకు వినియోగించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వాటిని వేలం ద్వారా విక్రయిస్తే, భవిష్యత్తులో కాలనీల నిర్వహణ ఖర్చులు నేరుగా ప్రజలపై భారం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే ఈ వేలం ప్రక్రియను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా 2BHK కాలనీలలో ఇంకా అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేయడానికి,అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, లింగస్వామి, శంకర్, పార్టీ నాయకులు భాస్కర్, చైతన్య, శ్రీను, శ్యామ్, చలపతి, శ్రీనివాస్‌తో పాటు కాలనీలకు చెందిన ప్రజలు జ్యోతి, గోపాల్, లక్ష్మి, సురేష్, శ్రీనివాస్, రామ్ రెడ్డి తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15: (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో సిఐ ఓ.వెంకటేష్ ఎస్సై రాహుల్ రెడ్డి. ఎల్లారెడ్డిపేట ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు కట్టేల బాలయ్య. అధ్యక్షులు కొత్తపెల్లి బాలరాజు. ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్. పెంటం ప్రవీణ్. గన్నగోని అంజయ్య. కట్టెల బాబు తుపాకుల ప్రవీణ్. బస్వాపురం బాలయ్య దేవానందం .నవాబ్ . అజముద్దీన్. సాయి ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

## పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారు

**–రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సులో ఏసిపి సైదయ్య..**

**మధిర, ఏప్రిల్ 15( మన వార్త ):** రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని డి.సీ.ఆర్.బి





ఏసిపి సైదయ్య స్పష్టం చేశారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మధిర రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మధిర మండలంలోని దెందుకూరు గ్రామంలో అరైవ్ అలైవ్’ రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డి సి ఆర్ బి ఏసిపి సైదయ్య హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని,ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం,రాంగ్‌సైడ్ డ్రైవింగ్,సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పేద విద్యార్థులకు అండగా ఏఎండి ఫౌండేషన్- సైకిళ్ల పంపిణీతో విద్యకు కొత్త ఉత్సాహం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి )**భద్రాద్రి కొత్తగూడెం బూడిదిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేదవిద్యార్థులకువిద్యాభ్యాసంలో సౌలభ్యం కల్పించేందుకు ఏఎండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి రోజూ కాలినడకన పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సమయానికి స్కూల్‌కు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించిన ఫౌండేషన్, వారికి సైకిళ్లు అందజేసి విద్య పట్ల ఆసక్తిని పెంచే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టింది. ఈసందర్భంగా ఆదిల్ ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడిన, పేద విద్యార్థుల చదువుకు అడ్డంకులు తొలగించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్నిప్రారంభించామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పాఠశాలలను గుర్తించి దాదాపు 50 సైకిళ్ల వరకు పంపిణీ చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతూ, విద్యార్థులకు సైకిళ్లు అందించడం అనేది చిన్న సహాయం కాదని, అది వారి భవిష్యత్తును మార్చగల గొప్ప అడుగని అభినందించారు. కొత్తగూడెం డిప్యూటీ మేయర్ లలిత కుమారి కూడా మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వీరమ్మ, ఆకునూరి సుప్రియ, ఎండి దావూద్, జెల్లీ శ్రీలక్ష్మి, రైల్వే బోర్డు సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, ఎక్స్ కౌన్సిలర్లు కనుకుంట్ల కుమార్, తలుగు అనిల్, కొత్తగూడెం నియోజకవర్గ మైనారిటీ నాయకుడు గౌస్ మొయినుద్దీన్, జానీ పాషా, షేక్ నయీమ్, ఎస్డీ నదీమ్, ఎస్.కె అస్లాం, మజీద్, ఏఎండి టీం సభ్యులు డాక్టర్ సాయి ప్రసన్న, అభిలాష్, ఎం.కె.ఏ గౌతం టీం తదితరులు పాల్గొన్నారు. పాఠశాలకు సకాలంలో చేరుకునే అవకాశాన్ని కల్పించే ఈ సైకిళ్లు విద్యార్థుల చదువులో నిరంతరతను పెంచడమే కాకుండా,వారిఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులుఅభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మాజీ ఎం ఎల్సి ఆకుల లలితకు ఘన సన్మానం గ్రామ సమస్యలపై చర్చ



**సిరికొండ, ఏప్రిల్ 15 (మన వార్త ప్రతినిధి):**సిరికొండ మండలం పెద్ద వాల్గోట్ గ్రామానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మరియు మాజీ MLC శ్రీమతి ఆకుల లలిత కి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్ద వాల్గోట్ గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ ఆధ్వర్యంలో ఆవెను సన్మానించారు. అనంతరం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆకుల లలిత గారి దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె కూడా సమస్యలను శ్రద్ధగా విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, మండల గౌడ యూత్ అధ్యక్షుడు కోరేపు శ్రీకాంత్ గౌడ్, గద్దల భాగ్య, కారోబార్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# పోల్ షిఫ్టింగ్‌పై అధికారులకు వినతి

**-వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని డిమాండ్...**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఏప్రిల్ 15 మన వార్త :**మల్కాజిగిరి నియోజకవర్గంలో ఇళ్లపైభాగాల మీదుగా



వెళ్తున్న ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్లు, పాతబడిన విద్యుత్ కంబాల సమస్యలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు.మైనాంపల్లి హనుమంతరావు సూచనల మేరకు, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ కి పోల్ షిఫ్టింగ్ అంశంపై ప్రాతినిధ్యం సమర్పించారు.అనంతరం టీఎస్ఎస్‌పీడీసీఎల్ హబ్సిగూడ సర్కిల్ ఎలక్ట్రిసిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.ఈ. వెంకన్న గారిని కలిసి, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మరియు సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా, ఇళ్ల పైభాగాల మీదుగా వెళు _న్న ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్లను వెంటనే మార్పు చేయడంతో పాటు, పాతబడిన మరియు తుప్పు పట్టిన ఇనుప కంబాలను తొలగించి, కొత్త కంబాలను సరైన సరళిలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కంబాలు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లకు అనుకూలంగా లేకపోవడంతో అభివృద్ధి పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు.ఈ సమస్యలు ముఖ్యంగా కౌకూర్ ప్రాంతంలోని హరిజన్ బస్తీ, మహదేవ్‌పూర్, కింధి బస్తీ మరియు భారత్ నగర్ 189 డివిజన్, యాప్రాల్ ప్రాంత ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి.ఈ విషయంపై మైనంపల్లి హనుమంతరావు అధికారికంగా లేఖ అందజేయడంతో పాటు, సంబంధిత అధికారులతో వ్యక్తిగతంగా మాట్లాడి, వర్షాకాలం ప్రారంభం కాకముందే ఈ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరారు.ప్రజల భద్రత, అభివృద్ధి పనులు సాఫీగా సాగేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత–ఓమినీ మినీ వ్యాన్ స్వాధీనం




**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 15 : (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వానరాసి కనకయ్య,తండ్రి మల్లయ్య,వయస్సు 39 సంవత్సరాలు, కులం బేడ బుడగ జంగం, అనునతుడు తన ఒమినీ మినీ వ్యాన్ లో ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తుండగా గొల్లపల్లి బస్ స్టాప్ వద్ద పట్టుకొని అందాద 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం, దాదాపు విలువ 7,000 వరకు ఉండును, గల వాటిని సీజ్ చేసి, నిందితున్ని ఓమినీ మినీ వ్యాన్ యుక్తంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి తెలిపారు.

## భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి...

**-యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో దారుణ ఘటన...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15** ధర్మేచ అర్తేజ కామేచ మోక్షేచ





నాతిచరామి అని ప్రమాణం చేసిన భర్త భార్యపై కోపంతో కన్న కూతురినే చంపేశాడు. ఈ దారుణ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హన్మ పురం గ్రామంలో నివాస ముంటున్న నాగరాణి శ్రీరాములు దంపతులకు రెండేళ్ల కూతురు ఉంది. భార్యాభర్తలిద్దరూ మూగ వారు. ఆయితే , కొన్ని రోజులుగా దంపతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. బుధవారం రోజు మనవరాలిని తీసుకెళ్లడానికి శ్రీరాముల తండ్రి (తాత) హన్మపురం వెళ్లడంతో ఆయన నుంచి చిన్నారిని తండ్రి శ్రీరాములు లాక్కున్నాడు. ఆ తరువాత గ్రామ శివారులో తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. ఇంటికి వచ్చి పాప స్పృహ కోల్పోయిందని సైగలు చేశాడు. చెరువు సమీపంలో వెళ్లి చూడగా చిన్నారి స్పృహ తప్పిపోయి ఉండడంతో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని బంధువులు తెలిపారు. అనంతరం చిన్నారిని చంపిన తండ్రి పోలీస్ స్టేషన్ కు వెళ్లి తనకు తానుగా లొంగి పోయినాడు. అత్తింటి వారి కారణంగానే తండ్రి శ్రీరాములు పాపను హత్య చేశాడని , అలాంటి వాడిని కఠినంగా శిక్షించాలని భార్య తరపు బంధువులు డిమాండ్ చేశారు.

## ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో నా బిడ్డ ఆరోగ్యం నా బాధ్యత తల్లిదండ్రుల ప్రతిజ్ఞ కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం, భద్రాచలం రూరల్ , ఏప్రిల్ 15 ( మన వార్త ప్రతినిధి ).**8వ జాతీయ పోషణ పక్షం (పోషణ పఖ్వాడా 2026) సందర్భంగా దుమ్ముగూడెం మండలం, వీరభద్రపురం నందు స్థానిక ఐ.సి.డిఎస్. ప్రాజెక్టు ఆధ్వర్యంలో "నా బిడ్డ ఆరోగ్యం □ నా బాధ్యత" పేరుతో ప్రత్యేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పోషణ పఖ్వాడా కార్యక్రమాల భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పాల్గొన్న తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఐదు ముఖ్యమైన సంకల్పాలను ప్రకటించారు. ముఖ్యంగా పిల్లలకు ఇంట్లో వండిన పోషకాహారం అందించడం, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించడం, స్థానికంగా లభించే చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగం చేయడం వంటి అంశాలపై వారు ప్రతిజ్ఞ చేశారు. అదనంగా, సమతుల్య ఆహారం ద్వారా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడాలని సంకల్పించారు.అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది తల్లిదండ్రులకు పిల్లల అభివృద్ధి దశలపై అవగాహన కల్పించారు. శిశువు మొదటి ఆరు సంవత్సరాలు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమని, ఈ సమయంలో సరైన పోషకాహారం, ప్రేమ, శ్రద్ధ, విద్యా ప్రేరణలు అవసరమని వివరించారు.పోషణ పక్షాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యే ఉద్యమంగా తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి కుటుంబం "ఇంటింటా పోషకాహారం □ ప్రతి బిడ్డ ఆరోగ్యం" లక్ష్యంతో ముందుకు వస్తేనే సుపోషిత భారత్ సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంజు బాక పంచాయితీ సర్పంచ్ కొమరం శాంతమ్మ రాజేశ్వరి స్కూల్ హెచ్ఎం మంగ వేణి ఉపాధ్యాయురాలు సుశీల ఏఎన్ఎం లు రామలక్ష్మి శ్యామల అంగన్వాడి టీచర్లు కోడి విజయలక్ష్మి కొర్స విజయలక్ష్మి ఆశ మంగవతి, ఎఫర్ట్ సిబ్బంది మౌనిక, గోపి మరియు గర్భిణీ, బాలింతలు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది

## రోడ్డు భద్రత వారోత్సవాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించిన పోలీసులు....



**నార్సింగి ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి)**రోడ్డు భద్రతా నియమాల పై విద్యార్థులలో అవగాహన కలిగించడానికి స్థానిక ఎస్ఐ బీమరి సృజన ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రవి చందర్ విద్యార్థుల తో మానవ హారం ఏర్పాటు చేసి, రోడ్డు భద్రతా నియమాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల తో రోడ్డు ప్రయాణాలు చేసే తమ తండ్రులకు రోడ్డు భద్రత పాటించాలని కోరుతూ (వ్యాస్ రచన పోటీ రూపం లో) ఉత్తరాలు రాయించారు. ఈ పోటీలో ఆంగ్ల మాధ్యమం 8 వ తరగతి చదువుతున్న సీ. హెచ్ సాయి రాసిన ఉత్తరం అందరినీ ఆకట్టుకోగా అతనికి తొలి బహుమతి అందుకోగా మరో 19 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సృజన, ఎం.ఎన్.ఓ రామకృష్ణా, స్వామి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారుల భద్రత మన అందరి బాధ్యత : టూ టౌన్ సిఐ ప్రతాప్




**కొత్తగూడెం ఏప్రిల్ 15 (మన వార్త ప్రతినిధి ):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ – అలైవ్ కార్యక్రమం కింద బుధవారం టూ టౌన్ పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రహదారుల భద్రత మన అందరి బాధ్యత అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ డి ప్రతాప్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలనే విషయాన్ని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు గుర్తుచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రహదారి నియమాలను గౌరవించడం వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, వాటిని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# వల్లూరులో పీడీఎస్ బియ్యం పట్టివేత..



**నార్సింగి ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి)**మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు వద్ద అధికారులు చాకచక్యంగా వ్యవహరించి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.హైదరాబాద్ నుండి రామాయంపేట్ వైపు వెళ్తున్న ఒక లారీ, వల్లూరు వద్ద భోజనం కోసం ఆగి ఉండగా అధికారులకు అనుమానం కలిగింది. అదే సమయంలో హైదరాబాదు నుండి వస్తున్న సివిల్ సప్లైస్ డీఎస్పీ వెంకటేశం, ఇన్స్పెక్టర్ లు పండరి, వెంకటేశ్వర్లు, ఎస్సై సాంబశివరావు, సివిల్ సప్లైస్ ఇన్స్పెక్టర్ నర్సింలు లారీని తనిఖీ చేశారు.తనిఖీలో లారీలో సుమారు 350 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు మాట్లాడుతూ రోడ్డు పక్కన లారీ ఆగి ఉండడంతో అనుమానం వచ్చి లారీని తనిఖీ చేయడం జరిగిందని వాటిలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు సుమారు 350 కింద రేషన్ బియ్యం ఉన్నాయని లారీని నార్సింగ్ పోలీసులకు అప్పగించడం జరుగుతుందని బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు, నార్సింగి పోలీసులకు సమాచారం అందించి, లారీని వారి ఆధీనంలో ఉంచారు,

## న్యూ ఎరా గర్ల్స్ కాలేజ్ విద్యార్థినీ బైపిసి స్టేట్ ఫస్టు ర్యాంకర్ కు కలెక్టర్ ఘన సన్మానం



**కల్వకుర్తి. ఏప్రిల్ 15 మన వార్తా ప్రతినిధి** కల్వకుర్తి పట్టణంలోని న్యూ ఎరా గర్ల్స్ జూనియర్ కళాశాల కు చెందిన ఇంటర్ విద్యార్థిని షగుప్తనాజ్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బైపిసి ఫస్టియర్ విభాగంలో 440 కి 438 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ సాధించి తన ప్రతిభ ను చాటింది.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాణావత్ సంతోష్ గారు స్టేట్ ఫస్టు ర్యాంకర్ షగుఫ్తనాజ్ మరియు హాజీరా ఉన్నీసా ,సహాస్ర లను కలెక్టర్ గారు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూ ల్ జిల్లా గర్వపడేలా చక్కటి ర్యాంకులు అందించిన కళాశాల ప్రిన్సిపాల్ మస్న సత్యం సార్ ని అభినందించారు. క్రమశిక్షణ , పట్టుదల, అంకితభావంతో గురువులు చెప్పిన ప్రకారం చదువుకొని చక్కటి ప్రతిభను చాటిన విద్యార్థుల్ని కలెక్టర్ అభినందించారు.ఈకార్యక్రమంలో సామాజిక విద్యావేత్త సదానందం గౌడు, మహమ్మద్ షమీ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15: (మన వార్తా ప్రతినిధి )**అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీసులు రహదారి పక్కన ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సూచనలు డ్రైవర్లు జాగ్రత్తగా వాహనం నడపడానికి సహాయపడతాయి. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి అని తెలిపినారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల డి.ఎస్.పి కె,నాగేంద్ర చారి, ఎల్లారెడ్డిపేట సీఐ ఓ వెంకటేష్, మరియు ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి, పాల్గొన్నారు.

## నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నూతన సూపరిండెంటెకు ఘన సన్మానం- ఎన్సిపి జిల్లా అధ్యక్షుడు విట్టల్ నాయక్ శుభాకాంక్షలు



**సిరికొండ, ఏప్రిల్ 15 (మన వార్త ప్రతినిధి):**నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా సూపరిండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నాగ మోహన్ ఈరోజు ఎన్సిపి జిల్లా అధ్యక్షులు విట్టల్ నాయక్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.కొత్త బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాగ మోహన్ కి శుభాకాంక్షలు తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని విట్టల్ నాయక్ ఆకాంక్షించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా సేవలు అందించాలని కోరారు.డాక్టర్ నాగ మోహన్ కూడా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆరోగ్య సేవల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.ఆసుపత్రిలో సదుపాయాలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజు వసంతరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.వైద్య సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సన్మానం కార్యక్రమం సాదరంగా, ఆత్మీయ వాతావరణంలో జరిగింది.అందరూ కలిసి డాక్టర్ నాగ మోహన్ కి విజయవంతమైన పదవీకాలం కోరుకున్నారు.

# దివ్య బాల పాఠశాలలో అరైవ్-అలైవ్...

**-రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన...**

**-మానవహారం నిర్వహించిన దివ్య బాల పాఠశాల విద్యార్థులు...**



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15** ఈరోజు "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు దివ్య బాల పాఠశాల విద్యార్థులతో జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ సిబ్బందితో కలిసి బుధవారం రోజు పాఠశాల విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. దీంతో పాటు , విద్యాసంస్థల బస్సులను 'ఈఐబి' తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాహన పత్రాలు , డ్రైవర్ లైసెన్సులు , మరియు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.పాఠశాలల వద్ద , బస్సులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే ఆగేలా చూసేందుకు , నిర్దేశిత పికప్ , డ్రాప్ పాయింట్లను స్పష్టంగా గుర్తించి , గుర్తు పెట్టారు. బస్సు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను నొక్కి చెబుతూ , పాఠశాల బస్సు సిబ్బందికి , పిల్లలకు భద్రతా మార్గ దర్శకాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ , జిల్లా రవాణా అధికారులు , భువనగిరి ట్రాఫిక్ ఎస్. హెచ్.ఓ , ఇతర అధికారులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ద్వారా ఆర్థిక సహాయం



**కల్వకుర్తి ఏప్రిల్ 15 మన వార్తా ప్రతినిధి** కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలోనీ 2వ వార్డు తిలక్ నగర్ కు చెందిన దేవకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నేత, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కి తెలిసిన వెంటనే వారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం దారమోని గణేష్, మధు, రాజు యాదవ్,యాకూబ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడిల సమస్యల పరిష్కారానికి కృషి

**–కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్...**

**కల్వకుర్తి. ఏప్రిల్ 15 మన వార్త ప్రతినిధి** కల్వకుర్తి మున్సిపాలిటీలో ఉన్నటువంటి 24అంగన్వాడీ సెంటర్ లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మెన్ శానవాజ్ ఖాన్ తో కలిసి అంగన్ వాడీ సీడీపీఓ, ఐసిడిఎస్ సూపర్ వైజర్, అంగన్ వాడి టీచర్ లతో సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్ వాడిలకు పక్క భవనాలు, వాటిలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం, మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుమారు 15 అంగన్వాడీలకు స్వంత భవనాలు లేవని వాటికీ మున్సిపల్ నుండి స్థలాలు కేటాయించి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు.




## ధర్పల్లి మండలం హోన్నాజిపేట్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం




**మన వార్త ప్రతినిది** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హోన్నాజిపేట్ గ్రామంలో రైతులకు ఉపయుక్తంగా నిలిచే PACS వరి కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ గౌరవ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి గారి ఆదేశాల మేరకు, డీసీసీ ప్రధాన కార్యదర్శి వెలమ భాస్కర్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మెట్టుమరి గ్రామ సర్పంచ్ కేతావత్ తిరుపతి, ఉపసర్పంచ్ గోపీనాయక్, సీఈవో గంగ నరసయ్య, మాజీ సర్పంచ్ మంజుల బాల్ సింగ్, గ్రామ వీడీసీ సభ్యులు కేతావత్ ప్రకాష్, అలాగే గ్రామ పెద్దలు కేతావత్ బద్యా నాయక్, రాందన్, విట్టల్, రామ్ రెడ్డి, మున్ సింగ్, అజ్మీర్ సుబ్బా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ప్రారంభంతో హోన్నాజిపేట్ మరియు పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు కలగనుందని తెలిపారు.

## నేతన్నలకు నేటి నుండి మే 13 వరకు వైద్య శిబిరాలు...

**–ఒక ప్రకటనలో తెలిపిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా , ఏప్రిల్ 15 మన వార్త జిల్లా ప్రతినిధి** జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నేటి నుండి మే 13 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10,323 మంది చేనేత కార్మికులు నివసిస్తున్నారని ఆయా మండలాలు , గ్రామాలలో ఈ నెల 16వ తేదీ నుండి ఆరోగ్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలలో ప్రభుత్వ వైద్యులు అయిన జనరల్ ఫిజీషియన్ , ఆప్తమాలజిస్ట్ (కంటి వైద్యుడు) , ఆర్థోపెడిషియన్ (ఎముకల వైద్యుడు) పాల్గొని చేనేత కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి , అవసర మైన మందులు అందజేయ బడును. ఈ శిబిరాలలో చేనేత కార్మికులకు రక్తపోటు పరీక్షలు , షుగర్ పరీక్షలు , కంటి పరీక్షలు , ఎముకల సమస్యల నిర్ధారణతో పాటు వివిధ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించబడును. వ్యాధుల తీవ్రతను బట్టి రిఫరల్ హాస్పటల్ తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు .శిబిరాల సమయం & తేది ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆరోగ్య శిబిరాల తేదీలు , ప్రదేశాలు అందుబాటులో ఉంటాయన్నారు. 16-4-2026 ఆలేరు మండలం గౌడ సంఘం మందిరం , 17-04-2026 ఆత్మకూరు మండలం పిహెచ్సి ఆత్మకూరు ,18-04-2026 యుపిహెచ్సి భువనగిరి , 20-04-2026 నుండి 23-04-2026 వరకు చౌటుప్పల్ కొయ్యలగూడెం , కుంట్లగూడెం ప్రాంతాలు 24-04-2026 పీహెచ్సీ మోటకొండూరు , 25-04-2026 పీహెచ్సీ మోత్కూర్ , 27-04-2026 నుండి 02-05-2026 వరకు పోచంపల్లి సొసైటీ డైయింగ్ హౌస్ , 04-05-2026 పిహెచ్సి రాజాపేట ,05-05-2026 , 06-05-2026 సిహెచ్సి రామన్నపేట , 07-05-2026 పిహెచ్సి వలిగొండ , 08-05-2026 పిహెచ్సి యాదగిరిగుట్ట , 11-05-2026 పిహెచ్సి గుండాల , 12-05-2026 పిహెచ్సి నారాయణపూర్ 13-05-2026 పుట్టపాక క్లస్టర్ బిల్డింగ్. కావున జిల్లాలోని చేనేత కార్మికులు , వారి కుటుంబ సభ్యులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసు కోవలసిందిగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు.



## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు




**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15:(మన వార్తా ప్రతినిధి )** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం, నారాయణపూర్ సీతారామ కమాన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్న పిచ్చిమొక్కలను, అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను జెసిబి సహాయంతో తొలగించారు ముఖ్యంగా మలుపుల వద్ద వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా అడ్డుగా ఉన్న పొదలను తొలగించడం ద్వారా ప్రమాదాల నివారించగలమని ఎస్సై రాహుల్ రెడ్డి, తెలిపారు. అంతేకాకుండా వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## 15వ ఆర్థిక సంఘం ( ఎఫ్ ఎఫ్ సి ) నిధుల వినియోగంపై అవగాహన కార్యక్రమం



**రాయపోల్ ఏప్రిల్ 15,( మన వార్త):** రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో బుధవారం పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం ( ఎఫ్ ఎఫ్ సి ) నిధుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ ఏడిఏ బాబు నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ డి ఏ బాబు నాయక్ ఎంపీడీవో శ్రీనివాస్, మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను సరైన విధంగా, నిబంధనల ప్రకారం వినియోగించడం ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. స్థానిక సంస్థలు నిధులను పారదర్శకంగా మరియు బాధ్యతతో వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఇతర సామాజిక సమస్యలపై కూడా చర్చించడం జరిగింది. ఈ సమస్యలను నివారించడంలో సర్పంచులు ఉప సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)లో భాగంగా గురువారం నిర్వహించనున్న మండల స్థాయి సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమం గ్రామ పంచాయతీలలో నిధుల సక్రమ వినియోగం, పారదర్శకత మరియు బాధ్యతాయుత పాలనకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలి...

**–జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం రోజు భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు , సిబ్బంది ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు , సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందు బాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతిరోజు ఓ.పి కి ఎంతమంది వస్తున్నారని ఓ.పి రిజిస్టర్ ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు , సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా అని ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. డాక్టర్లు , సిబ్బంది మంచిగా చూస్తున్నారా..అని ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్ర పరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటిన బాల్యమిత్రులు..

**–మృతుడి కుటుంబానికి 65 వేల ఆర్థిక సాయం...**

**ఇల్లందకుంట,ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి):** హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్న ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన ముప్పు నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే,కాగా మృతుని బాల్య మిత్రులు అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. బాల్యమిత్రులు నరేష్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం 1నిమిషం మౌనం పాటించారు. 2003-04 వరకు పదవ తరగతి సిరిసేడు ప్రభుత్వ పాఠశాలలో కలిసి చదివిన స్నేహితులు నరేష్‌తో పంచుకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. "మాతో కలిసి ఆడి పాడి చదువుకున్న మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరం" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాల్యమిత్రులతో పాటు ఇంటర్, డిగ్రీ చదివిన తోటి మిత్రులు కలిసి రూ ,65 వేల నగదును నరేష్ భర్తకు అందజేశారు. నరేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇకపై కూడా నరేష్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తోడుగా నిలుస్తామని మిత్రులు మృతిని తల్లికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన బాల్యమిత్రులు, ఇంటర్-డిగ్రీ మిత్రబృందం పాల్గొన్నారు.



## అడవి బిడ్డ డాక్టర్ కలకు 1.50 లక్షల సాయం



**–వాజేడు ఎంబీబీఎస్ విద్యార్థినికి బీఆర్ఎస్ నేతల చేయూత...**

**వాజేడు ఏప్రిల్ 15 మనవార్త** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన గిరిజన కుటుంబంలోని ఎంబీబీఎస్ విద్యార్థిని చదువు కొనసాగించేందుకు బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు 1,50,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. వాజేడు మండల కేంద్రానికి చెందిన తల్లాడి యశోద, శేసయ్య దంపతుల ప్రథమ కుమార్తె నవ్యజ్ఞాపిక కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుటుంబానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువు మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం వాజేడు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెరుమాళ్ళ రామకృష్ణారెడ్డి, మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బొడ్డెబోయిన బుచ్చయ్య దృష్టికి వచ్చింది. వారు వెంటనే స్పందించి పార్టీ జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థిని పరిస్థితిని తెలుసుకున్న వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుడవర్తి నర్సింహామూర్తి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు చలించిపోయారు. వారు వెంటనే 1,50,000 రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. మంగళవారం ఏటూరునాగారంలోని లక్ష్మణ్ బాబు నివాసంలో మాజీ జల అభివృద్ధి సంస్థ చైర్మన్ విరమల్ల ప్రకాశ్ చేతుల మీదుగా నవ్యజ్ఞాపిక తల్లి యశోదకు నగదును అందజేశారు. గిరిజన కుటుంబానికి చెందిన తమ కుమార్తె చదువుకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న బీఆర్ఎస్ నాయకులకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నిజాముద్దీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, పాయం జానకి రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూక్య జంపన్న లాంటి వారే లీడర్ గా రావాలి..

**ములుగు జిల్లా ఏప్రిల్ 15 (మనవార్త ప్రతినిధి)** ములుగు జిల్లా యువతీ యువకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ విడత మెగా జాబ్ మేళా మంగపేట మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమం నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, "భూక్య జంపన్న సేవలు జిల్లాకు ఆదర్శం. యువత కోసం ఆయన తీసుకుంటున్న ప్రతి అడుగు అభినందనీయం. వరుసగా జాబ్ మేళాలు నిర్వహిస్తూ వైల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప విషయం. ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలి" అని ప్రశంసించారు. మొత్తంగా, భూక్య జంపన్న నాయకత్వంలో జరుగుతున్న ఈ మెగా జాబ్ మేళాలు ములుగు జిల్లాలో ఉపాధి ఉద్యమంగా మారుతూ, యువతలో నూతన ఆశలు నింపుతున్నాయి. జిల్లాలో మార్పుకు దారితీసే ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరింత విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భూక్య జంపన్న తో పాటు కాకులమర్రి ప్రదీప్ రావు తాటి కృష్ణ ,చిట్టి మల్ల సమ్మయ్య ,కొమరం ధనలక్ష్మి సిద్ధం లక్ష్మణరావు తూక్కని శ్రీనివాస్ కూర్భన్అలీ యలవర్తి శ్రీనివాసరావు సత్యనారాయణ చారి ,అయూబ్ , కాటూరి సుగుణస్థానిక నాయకులు , ఏం పెల్లి రాజు పడిదల మహేందర్ అన్నారపు నాగార్జున ,వివిధ కంపెనీల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు..

**-దయగ్నస్టిక్ సెంటర్లు తనిఖీ...**
**-డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రవణ్...**



**జమ్మికుంట, ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణంలోని మెగా దయాగ్నస్ సెంటర్ మరియు లోటస్ దయాగ్నిస్ సెంటర్ ను హుజూరాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రవణ్ తనిఖీ చేశారు. తనిఖీ లో భాగంగా సెంటర్ నిర్వాహకులకు పి సి పి ఎన్ డి టి ఆక్టును (గర్భధారణకు ముందు మరియు ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతులు లింగ ఎంపిక నిషేధం చట్టం, 1994.) పకడ్బందీగా అమలు చేయాలని రికార్డులను ఫారం ఎఫ్ లో పొందుపరచాలని ఒకవేళ రికార్డులు ఫారం ఎఫ్ లో పొందుపరచకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి మీద పిసి పి ఎన్ డి టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని,దయాగ్నిసిస్ సెంటర్ కు వచ్చే రోగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయరాదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, సూపర్వైజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి పార్టి లో చేరిక..



**జమ్మికుంట, ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణానికి చెందిన వైఎస్ఆర్టీపీ మండల అధ్యక్షుడు అంబాల హరీష్ తో పాటు యూత్ నాయకులు రితీష్, నరేష్, సురేష్, విజయ్, శ్రీనివాస్, రమేష్ తదితరులు మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా అంబాల హరీష్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో కవిత నాయకత్వంలో పని చేస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ జాగృతిలో చేరినట్లు తెలిపారు. యువతకు ప్రాధాన్యత ఇస్తూ సమాజ సేవ చేయడానికి ఈ వేదిక అనుకూలమని పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, స్థానిక స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జమ్మికుంట పట్టణ బిజెపి కార్యవర్గ నియామకం...

**- ప్రకటించిన పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు...**

**జమ్మికుంట, ఏప్రిల్ 15( మన వార్త ప్రతినిధి):**జిల్లా సంఘటన పర్వ్ లో భాగంగా జమ్మికుంట పట్టణ కార్యవర్గ జాబితాను కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆమోదించి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు కి అందించినట్లు రాజు పేర్కొన్నారు.జమ్మికుంట పట్టణ బిజెపి ఉపాధ్యక్షులుగా గర్రెపల్లి నిరూప రాణి, ఆడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, కేస స్వరూప, ప్రధాన కార్యదర్శులుగా కైలాసకొటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, కార్యదర్శులుగా రాకేష్ ఠాకూర్, ఆకుల తిరుపతి, వాల్లాల సతీష్ బాబు, రాయబారపు సురేష్, కోశాధికారి గా కొండ్లె నగేష్, మరో 34 మందిని పట్టణ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. మాపై నమ్మకంతో పట్టణ కమిటీలో మాకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు కు కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

## వాజేడులో హిందూ ధర్మ సమ్మేళన సభకు భారీ స్పందన

**-కాషాయ కండువాలతో తరలివచ్చిన జనం...**
**-ఆర్ఎస్ఎస్ నేత కాచం రమేష్ ప్రసంగానికి విశేష ఆదరణ...**



**వాజేడు ఏప్రిల్ 15 మనవార్త** వాజేడు మండల హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన హిందూ ధర్మ సమ్మేళన సభ భారీ జనసందోహంతో విజయవంతంగా ముగిసింది.సాయంత్రం 6.30 నిముషాలకు గంటలకు ప్రారంభమైన సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి హిందూ బంధువులు కుటుంబ సమేతంగా, కాషాయ కండువాలు ధరించి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ప్రాంగణమంతా ఎరుపు, నీలం కుర్చీలతో నిండిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైటింగ్, సౌండ్ సిస్టంతో సభా ప్రాంగణం కోలాహలంగా మారింది.శ్రీశ్రీశ్రీ విశ్వ బ్రహ్మ శ్రీ పూజ్య వీరధర్మజ స్వామీజీ ఆశీ:ప్రసంగం అందించగా, ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ ప్రాంత కార్యవాహ శ్రీ కాచం రమేష్ హిందూ ధర్మం, సంస్కృతి, ఐక్యత ఆవశ్యకతపై ప్రసంగించారు.హిందువుగా జీవించు.. హిందువునని గర్వించు.. గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులం" అనే నినాదంతో సాగిన ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది.సభలో సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హాజరైన వారందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.హిందూ సమాజంలో చైతన్యం నింపేందుకు,దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో ఈ సభను నిర్వహించినట్లు హిందూ ధర్మ సమ్మేళన సమితి, వాజేడు మండలం నిర్వాహకులు తెలిపారు.సభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

## స్టాక్ మార్కెట్లలో భారీ లాభాలు



**ముంబై,** భారతీయ షేర్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలను నమోదు చేశాయి. ముఖ్యంగా బీఎస్ఈ సెన్సెక్స్ 1,264 పాయింట్ల లాభంతో ముగియగా, నిఫ్టీ 50 388 పాయింట్లు పెరిగింది. అంతర్జాతీయ పరిస్థితుల్లో సానుకూల సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులలో విశ్వాసం పెరిగి మార్కెట్లు లాభాల దిశగా పయనించాయి.అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పట్టాయని, ఇరాన్‌తో మళ్లీ చర్చలు జరగనున్నాయని చేసిన వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లకు ఊతమిచ్చాయి. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా స్పష్టంగా కనిపించింది.ఈ నేపథ్యంలో బీఎస్ఈలో నమోదైన సంస్థల మొత్తం మార్కెట్ విలువ దాదాపు పది లక్షల కోట్ల రూపాయల మేర పెరిగింది. ఉదయం ట్రేడింగ్‌లో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, మధ్యాహ్నం సమయంలో 78,270 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకి, చివరకు 78,111.24 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 24,231.30 వద్ద ముగిసి బలమైన వృద్ధిని నమోదు చేసింది.రంగాల వారీగా పరిశీలిస్తే విమానయాన, సమాచార సాంకేతిక, విద్యుత్ రంగాలకు చెందిన సంస్థలు ముందంజలో నిలిచాయి. ముఖ్యంగా ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ 4.63 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలవగా, ఎటర్నల్ లిమిటెడ్ 4.36 శాతం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 4.11 శాతం, టెక్ మహీంద్రా 3.33 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.31 శాతం లాభపడ్డాయి.మొత్తంగా ప్రపంచ ఆర్థిక పరిణామాలు అనుకూలంగా మారడం, పెట్టుబడిదారుల విశ్వాసం పెరగడం వంటి కారణాలతో భారతీయ షేర్ మార్కెట్లు బలమైన లాభాలను నమోదు చేసినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అల్వాల్ మీసేవా కేంద్రంలో ఏసీబీ సోదాలు...

**-సర్టిఫికెట్ల సంతకాలపై అవినీతి ముసుగు తొలగింపు!**



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఏప్రిల్ 15 మన వార్త :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్ ప్రాంతంలో పౌర సేవల నిర్వహణలో భారీ అవకతవకలు జరిగినట్లు వెలుగులోకి రావడంతో, మీసేవా కేంద్రంపై అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆదాయ, కుల సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు తీవ్రతరం కావడంతో ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం.స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ప్రకారం, మీసేవా కేంద్రంలో సాధారణంగా పొందాల్సిన సేవల కోసం అధికారిక ఫీజులతో పాటు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దళారుల ద్వారా పనులు వేగంగా పూర్తిచేస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మీసేవా కార్యాలయంలో సోదాలు చేపట్టారు. సోదాల సమయంలో కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లు, పత్రాలను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు.సోదాల సందర్భంగా బయటపడిన అంశాలు ఈ వ్యవహారంపై మరింత అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అల్వాల్‌లోని శ్రీదేవి జిరాక్స్ సెంటర్‌లో కుల మరియు ఆదాయ సర్టిఫికెట్లపై అనధికార సంతకాలు ఉన్న పత్రాలు లభించినట్లు తెలిసింది. అలాగే ఆదాయ సర్టిఫికెట్లలో మార్పులు, అప్డేట్లు చేయడం, సరైన ధృవీకరణ లేకుండా పత్రాలను జారీ చేయడం వంటి అంశాలు బయటపడినట్లు అధికారులు భావిస్తున్నారు.ఇదే సమయంలో మీసేవా సిబ్బంది మరియు రెవెన్యూ శాఖ అధికారుల మధ్య అనుచిత సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో పైస్థాయి అధికారుల ప్రమేయం ఉందా అన్న దానిపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.




స్థానిక ప్రజలు ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లినా అధికారులు అందుబాటులో ఉండరు. కానీ సర్టిఫికెట్లు మాత్రం సిద్ధంగా ఉంటాయి. దళారుల ద్వారా డబ్బులు చెల్లించినవారికి మాత్రమే పనులు సులభంగా పూర్తవుతున్నాయి" అంటూ ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ సేవలను పొందడానికి సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, అక్రమ మార్గాల్లో సర్టిఫికెట్లు సులభంగా లభిస్తున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితి పౌర సేవలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సోదాల్లో లభించిన ఆధారాలపై సంబంధిత సిబ్బంది మరియు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. డీజీ ఆదేశాల మేరకు పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.ఈ ఘటన నేపథ్యంలో మీసేవా కేంద్రాల పనితీరు, సర్టిఫికెట్ల జారీ విధానంపై పునఃపరిశీలన అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని పారదర్శక వ్యవస్థను అమలు చేయకపోతే, ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## పెరిగిన పుత్తడి తగ్గిన వెండి



**హైదరాబాద్,** ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న ఆర్థిక, రాజకీయ పరిణామాల ప్రభావంతో బంగారం, వెండి ధరలు రోజువారీగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఒక రోజు పెరుగుదల కనిపిస్తే, మరుసటి రోజు తగ్గుదల కనిపించడం సాధారణంగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం పుత్తడి ధర స్వల్పంగా పెరగగా, వెండి ధర మాత్రం తగ్గింది.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మంగళవారం రూ.1,53,930గా ఉండగా, బుధవారం స్వల్పంగా పెరిగి రూ.1,53,940కు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,110గా నమోదైంది.ఇక వెండి ధర విషయానికి వస్తే, కిలోకు రూ.2,54,900గా కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే వెండి ధర సుమారు రూ.5 వేల మేర తగ్గడం గమనార్హం. ఈ మార్పులు పెట్టుబడిదారులలో జాగ్రత్త భావనను పెంచుతున్నాయి.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు దాదాపు ఒకే విధంగా కొనసాగుతున్నాయి. బెంగళూరు, కోల్‌కతా, పుణె, ముంబై, భువనేశ్వర్ వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,940గా, 22 క్యారెట్ల ధర రూ.1,41,110గా ఉంది. చెన్నై, కోయంబత్తూర్ నగరాల్లో మాత్రం కొంచెం ఎక్కువగా ఉండి 24 క్యారెట్ల బంగారం రూ.1,55,140గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,42,210గా నమోదైంది. జైపూర్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,54,090గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,41,260గా ఉంది.వెండి ధరలు కూడా నగరాలవారీగా స్వల్ప మార్పులతో కొనసాగుతున్నాయి. బెంగళూరు, కోల్‌కతా, పుణె, ముంబై, జైపూర్ నగరాల్లో కిలో వెండి ధర రూ.2,54,900గా ఉండగా, చెన్నై, భువనేశ్వర్, కోయంబత్తూర్ నగరాల్లో రూ.2,65,100గా నమోదైంది.మొత్తంగా చూస్తే అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, డాలర్ మారకం విలువ, ముడి చమురు ధరల మార్పులు వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెట్టుబడిదారులు ఈ మార్పులను గమనిస్తూ తమ పెట్టుబడులను జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

## డిస్నీలో ఉద్యోగాల కోత...




**న్యూఢిల్లీ,** ప్రపంచ ప్రఖ్యాత వినోద సంస్థ ద వాల్ట్ డిస్నీ కంపెనీ మరోసారి ఉద్యోగాల కోత నిర్ణయంతో వార్తల్లో నిలిచింది. సంస్థ కొత్త సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన జోష్ డి అమారో, పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సమాచారం ప్రకారం సంస్థ సుమారు వెయ్యి మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ కోతలు ప్రధానంగా మార్కెటింగ్, స్టూడియోలు, టెలివిజన్ వ్యాపారం, క్రీడా విభాగం, ఉత్పత్తి మరియు సాంకేతిక విభాగాలతో పాటు కొన్ని కార్పొరేట్ విభాగాల్లో అమలు కానున్నాయి.ప్రస్తుతం డిస్నీ సంస్థ మార్కెటింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు 'ఏకీకృత మార్కెటింగ్ నిర్మాణం'ను అమలు చేస్తోంది. ఈ మార్పులను అసద్ అయ్యాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. సంస్థ కార్యకలాపాలను సులభతరం చేయడం, ఖర్చులను తగ్గించడం, కొత్త సాంకేతికతకు అనుగుణంగా వ్యవస్థను మలచడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.వినోద రంగంలో వేగంగా మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా సంస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని సీఈఓ జోష్ డి అమారో తన ప్రకటనలో తెలిపారు. గత కొద్ది నెలలుగా సంస్థలోని విభాగాల పనితీరును సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ చర్యలతో సంస్థ మరింత చురుకైన వ్యవస్థగా మారుతుందని, దీర్ఘకాలికంగా అభివృద్ధికి దోహదపడుతుందని కంపెనీ భావిస్తోంది. అయితే మరోవైపు ఉద్యోగాల కోత కారణంగా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనగా, పరిశ్రమలో కూడా ఈ నిర్ణయం విస్తృత చర్చకు దారితీసింది.

# పాపం ప్రతాప్‌కు కొత్త ప్రచారం జోష్




**హైదరాబాద్,** వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తిరువీర్ హీరోగా నటిస్తున్న పాపం ప్రతాప్ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం చేపట్టిన వినూత్న ప్రచార కార్యక్రమాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. 'మసూద', 'పరేషాన్', 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్' వంటి చిత్రాల ద్వారా తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్న తిరువీర్, ఈసారి సరదా కథతో ప్రేక్షకులను అలరించడానికి ముందుకొస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ నిర్మాణంలో రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తుండగా, దర్శకుడు ఎస్.పి. దుర్గ నరేష్ రూపొందిస్తున్నారు. ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం ఇప్పటికే విస్తృత స్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల విడుదల చేసిన ప్రత్యేక వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఒకప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన జట్కా పంచాయతీ తరహాలో రూపొందించిన ఈ వీడియోలో మంచు లక్ష్మి 'మంచు అక్క' పాత్రలో కనిపిస్తూ కథానాయకుడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తుంది. పెళ్లైన కొద్ది రోజుల్లోనే భార్య వదిలి వెళ్లిపోవడంతో బాధలో ఉన్న ప్రతాప్, ఆమెను ఆశ్రయించే సన్నివేశాలు వినోదాన్ని పంచుతున్నాయి. ముఖ్యంగా తిరువీర్ అమాయకంగా చెప్పే సమాధానాలు, మంచు లక్ష్మి తనదైన శైలిలో అడిగే ప్రశ్నలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. వీరి మధ్య సంభాషణలు సహజంగా ఉండటంతో వీడియోకు మంచి ఆదరణ లభిస్తోంది. చివర్లో అజయ్ ఘోష్ ప్రవేశం ఇవ్వడం సన్నివేశాన్ని మరింత హాస్యభరితంగా మార్చింది. ఆయన జోక్యానికి మంచు లక్ష్మి ఇచ్చే ప్రతిస్పందన ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతోంది. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాశి, రఘుబాబు వంటి అనుభవజ్ఞులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వీరి నటన సినిమాకు మరింత బలం చేకూర్చనుంది. మొత్తంగా చూస్తే వినూత్న ప్రచారం, వినోదభరితమైన కథ, సహజ నటనతో 'పాపం ప్రతాప్' చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విడుదల తర్వాత ఈ సినిమా ఏ స్థాయిలో విజయాన్ని సాధిస్తుందో చూడాలి.

# బాహుబలి యానిమేషన్‌కు అంతర్జాతీయ గౌరవం




**హైదరాబాద్,** భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన బాహుబలి ఫ్రాంచైజీకి మరో అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రభాస్ హీరోగా, దర్శక దిగ్గజం ఎస్. ఎస్. రాజమౌళి రూపొందించిన ఈ విజువల్ అద్భుతానికి కొనసాగింపుగా రూపొందుతున్న యానిమేషన్ చిత్రం బాహుబలి: ది ఎటర్నల్ వార్ ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్ వేడుకల్లో ఒకటైన అన్నెసీ అంతర్జాతీయ యానిమేషన్ చలనచిత్రోత్సవంకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. భారీ నిర్మాణ విలువలు, అద్భుతమైన కథనం, విశ్వస్థాయి దృశ్య వైభవంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బాహుబలి ఫ్రాంచైజీ, భారతీయ చిత్ర పరిశ్రమ రూపురేఖలను మార్చిన చిత్రంగా నిలిచింది. ఇప్పుడు అదే ఫ్రాంచైజీ ఆధారంగా రూపొందుతున్న యానిమేషన్ ప్రాజెక్ట్ అంతర్జాతీయ వేదికపై చోటు దక్కించుకోవడం దేశానికి గర్వకారణంగా మారింది. యానిమేషన్ రంగంలో అత్యున్నత స్థాయి ప్రాజెక్టులకు మాత్రమే అవకాశం లభించే ఈ ప్రతిష్టాత్మక ఉత్సవానికి ఈ చిత్రం ఎంపిక కావడం విశేషం. చిత్ర బృందం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఆనందం వ్యక్తం చేసింది. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ గుర్తింపు రావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. బాహుబలి ఫ్రాంచైజీకి ఉన్న భారీ ఆదరణ కారణంగా ఈ యానిమేషన్ చిత్రంపై కూడా మంచి ఆసక్తి నెలకొంది. దృశ్యాలు, యాక్షన్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ అన్నీ కలిపి ప్రపంచస్థాయి నాణ్యతను ప్రతిబింబిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రానికి ఇషాన్ శుక్ల దర్శకత్వం వహిస్తుండగా, ఆర్కా మీడియా వర్క్స్ నిర్మాణంలో భాగస్వామ్యం వహిస్తోంది. అలాగే ఎస్. ఎస్. రాజమౌళి కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలకంగా పాల్గొంటున్నారు. ఇప్పటివరకు ప్రధానంగా లైవ్ యాక్షన్ చిత్రాలతో ప్రపంచాన్ని ఆకట్టుకున్న భారతీయ సినిమా, ఇప్పుడు యానిమేషన్ రంగంలో కూడా తన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఆ దిశలో కీలక అడుగుగా భావిస్తున్నారు. మొత్తంగా చూస్తేడ ఈ చిత్రం విజయం సాధిస్తే భారతీయ యానిమేషన్ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సూర్య కెప్టెన్సీపై ముప్పు



**న్యూఢిల్లీ,** భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. జట్టును విజయపథంలో నడిపించినప్పటికీ, వ్యక్తిగతంగా బ్యాటింగ్‌లో స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోవడం అతని నాయకత్వంపై సందేహాలు రేకెత్తిస్తోంది. తాజాగా జరుగుతున్న లీగ్ పోటీల్లో కూడా అతను పరుగులు సాధించడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించింది. రాబోయే కీలక టోర్నమెంట్‌లను దృష్టిలో పెట్టుకుని కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలనే ఆలోచనలో ఉందని సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు ఉన్నప్పటికీ, మైదానంలో ఆటగాడిగా రాణించడం ఇప్పుడు సూర్యకు అత్యవసరమైంది. త్వరలో జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలు అతనికి కీలకంగా మారనున్నాయి. ఈ సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన ఇస్తేనే కెప్టెన్సీ కొనసాగించే అవకాశాలు ఉంటాయి. లేదంటే నాయకత్వ మార్పు అనివార్యమవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొత్త సారథి రేసులో అక్షర్ పటేల్ ముందంజలో ఉన్నాడు. అతనితో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. వీరి ప్రదర్శనలను ఆధారంగా చేసుకుని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే ఈ నిర్ణయం భారత జట్టు మార్గాన్ని నిర్ణయించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టీ20 విజేతలకు నాడా నిఘా...



**న్యూఢిల్లీ,** 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు విజయం అందించిన జట్టులోని కీలక ఆటగాళ్లపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నాడా నిఘా పెంచింది. క్రీడల్లో పారదర్శకతను కాపాడేందుకు ఇద్దరు ప్రముఖ క్రికెటర్లను రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో చేర్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిణామం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు వరుస విజయాలతో చరిత్ర సృష్టించిన నేపథ్యంలో, ఈ చర్యకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం లీగ్ పోటీల్లో బిజీగా ఉన్న ఆటగాళ్లను కూడా ఈ జాబితాలో చేర్చడం గమనార్హం. ఈ టెస్టింగ్ పూల్‌లో ఉన్న క్రీడాకారులు ప్రతిరోజూ తమ నివాస వివరాలను ముందుగానే నాడాకు తెలియజేయాలి. ఎప్పుడైనా అధికారులు వచ్చి రక్తం లేదా మూత్ర నమూనాలు సేకరించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడు వరుసగా మూడు సార్లు వివరాలు ఇవ్వకపోతే, అది నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. తాజాగా ఈ జాబితాలో అభిషేక్ శర్మ, అక్షర్ పటేల్‌లను చేర్చారు. గతంలో ఉన్న స్మృతి మంధాన, శ్రేయస్ అయ్యర్ స్థానంలో వీరిని ఎంపిక చేసినట్లు సమాచారం. ప్రపంచకప్ విజయానంతరం ఈ ఇద్దరూ తమ తమ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తూ బిజీగా ఉన్నారు. ఇక నాడా నిఘాలో ఉన్న ఇతర ప్రముఖ క్రికెటర్లలో శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, తిలక్ వర్మ, అర్ష్‌దీప్ సింగ్ వంటి ఆటగాళ్లు కూడా ఉన్నారు. క్రీడా స్ఫూర్తిని కాపాడటం కోసం ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, Mahabubabad,, TELANGANA-506101.
Published at Jammikunta, **KARIMNAGAR-TELANGANA**. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com